42వేల కోట్లు రైటాఫ్

6 నెలల్లో ప్రభుత్వ బ్యాంకులు వదిలించుకున్న రుణాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి 6 నెలల్లో (ఏప్రిల్-సెప్టెంబర్) దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు రైటాఫ్ చేసిన రుణాల విలువ రూ.42,035 కోట్లుగా ఉన్నది. ఈ మేరకు సోమవారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి ప్రకటించారు. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) అత్యధికంగా రూ.8,312 కోట్ల రుణాలను ఖాతా పుస్తకాల నుంచి తొలగించిందని లోక్‌సభలో ఓ లిఖితపూర్వక సమాధానంలో మంత్రి పేర్కొన్నారు. ఆ తర్వాత స్థానాల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (రూ.8,061 కోట్లు), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రూ.6,344 కోట్లు), బ్యాంక్ ఆఫ్ బరోడా (రూ.5,925 కోట్లు) ఉన్నాయన్నారు. కాగా, 'రైటాఫ్ అంటే రుణాల రద్దు కాదు. కాబట్టి దీనివల్ల రుణగ్రహీతకు వచ్చే లాభమేమీ ఉండబోదు. రుణాలు తీసుకున్నవారు బ్యాంకులకు బకాయిపడే ఉంటారు. ఆ మొండి బాకీల వసూలుకు బ్యాంకులు రకరకాల పద్ధతుల్లో ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాయి' అని మంత్రి పంకజ్ చౌధరి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇదిలావుంటే ప్రభుత్వ రంగ బ్యాంకులు ఈ ఏప్రిల్-సెప్టెంబర్‌లో వసూలు చేసిన బకాయిల విలువ రూ.37,253 కోట్లుగా ఉన్నట్టు కూడా ఆయన తెలిపారు. ఇక గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ప్రభుత్వ రంగ బ్యాంకులు రైటాఫ్ చేసిన రుణాల విలువ రూ.1.14 లక్షల కోట్లుగా ఉన్నది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) ఇది రూ.1.18 లక్షల కోట్లుగా ఉండటం గమనార్హం. దీంతో రెండున్నరేండ్లలో ప్రభుత్వ బ్యాంకుల లోన్ రైటాఫ్‌లు రూ.2.74 లక్షల కోట్లపైనేనని తెలుస్తున్నది. వీటిలో ఎక్కువ కార్పొరేట్ల రుణాలే ఉండటం గమనార్హం.

ఆర్బీఐ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా

రెవెన్యూ కార్యదర్శిని నియమించిన కేంద్రం

పేరు	: సంజయ్ మల్హోత్రా
వయసు	: 56 ఏండ్లు
చదువు	: ఐఏఎస్ (1990 బ్యాచ్ రాజస్థాన్ కేడర్)
అనుభవం	: 33 ఏండ్లు
ప్రస్తుత హోదా:	కేంద్ర రెవెన్యూ కార్యదర్శి

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నూతన గవర్నర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి, రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రాను సోమవారం కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆర్బీఐకి ఈయన 26వ గవర్నర్ కానున్నారు. ప్రస్తుత గవర్నర్ శక్తికాంత దాస్ పదవీకాలం మంగళవారం (డిసెంబర్ 10)తో ముగుస్తున్నది. ఈ క్రమంలోనే ఆయన స్థానంలోకి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో రెవెన్యూ కార్యదర్శిగా పనిచేస్తున్న సంజయ్ మల్హోత్రాను మోదీ సర్కారు తీసుకొచ్చింది. ఈ మేరకు కేబినెట్ నియామకాల కమిటీ లైన్‌క్లియర్ చేసింది. బుధవారం (డిసెంబర్ 11) నుంచి మూడేండ్లపాటు ఆర్బీఐ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతల్ని నిర్వర్తించనున్నారు. ఐఐటీ కాన్పూర్ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్‌ను పూర్తిచేసిన సంజయ్ మల్హోత్రా.. అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీని సైతం పొందారు.

33 ఏండ్లలో..

33 ఏండ్ల తన కెరియర్‌లో ఎన్నో ప్రభుత్వ రంగ శాఖల్లో మరెన్నో బాధ్యతల్ని మల్హోత్రా నిర్వహించారు. రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. విద్యుత్తు, ఆర్థిక, పన్నులు, ఐటీ, గనులు తదితర రంగాల్లో సమర్థవంతంగా పనిచేశారు. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక శాఖలో రెవెన్యూ కార్యదర్శిగా పనిచేస్తుండగా, అంతకుముందు ఆర్థిక సేవల కార్యదర్శిగా ఉన్నారు. ముఖ్యంగా ప్రత్యక్ష, పరోక్ష పన్నులకు సంబంధించిన నిర్ణయాల్లో కీలకంగా వ్యవహరించారు.

నేడు దాస్ పదవీ విరమణ

ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మంగళవారం పదవీ విరమణ చేయనున్నారు. రిజర్వ్ బ్యాంక్ 25వ గవర్నర్‌గా 6 ఏండ్లు పనిచేసిన ఆయన.. అప్పటి గవర్నర్ ఊర్జిత్ పటేల్ అనూహ్య రాజీనామాతో 2018 డిసెంబర్ 12న ఈ పదవిలోకి వచ్చారు. 1980 తమిళనాడు కేడర్ ఐఏఎస్ అధికారి అయిన దాస్.. కేంద్ర ఆర్థిక శాఖలోని వివిధ హోదాల్లో పనిచేశారు. ఈ క్రమంలోనే 8 కేంద్ర బడ్జెట్లలో భాగస్వాములయ్యారు. ఇక అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్‌లో రెండుసార్లు టాప్ సెంట్రల్ బ్యాంకర్‌గా దాస్ అగ్రస్థానాల్లో నిలవడం విశేషం.

కేంద్రానికి దన్నుగా..

గవర్నర్‌గా ఊర్జిత్ పటేల్ వైఖరితో ఆర్బీఐ-కేంద్రం మధ్య దూరం పెరిగిన వేళ దాస్‌ను మోదీ సర్కారు తీసుకొచ్చింది. నిజానికి అప్పటికే దాస్ రిటైరైపోయారు. ఈ క్రమంలో తనపై కేంద్ర పెద్దలు పెట్టుకున్న నమ్మకాన్ని ఎప్పటికప్పుడు నిలబెట్టుకుంటూపోయిన దాస్.. ఆర్బీఐ మిగులు నగదు నిల్వలను కేంద్ర ఖజానాకు తరలించడం మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకున్నది. అంతేగాక ఏటా కేంద్రానికి భారీగా డివిడెండ్లనూ అందించారు. గత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను ఏకంగా మునుపెన్నడూలేనివిధంగా రూ. 2.11 లక్షల కోట్ల డివిడెండ్‌ను అప్పజెప్పారు. నిజానికి వీటిని వ్యతిరేకించే నాడు ఆర్బీఐ గవర్నర్ పదవికి పటేల్ రాజీనామా చేయడం గమనార్హం. ఇక కరోనా సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థను బలపర్చేందుకు వడ్డీరేట్లను బాగా తగ్గించడం, ఆ తర్వాత విజృంభించిన ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు అంతే స్థాయిలో పెంచడం, వృద్ధి-ధరల మధ్య సమన్వయం కోసం సుదీర్ఘకాలం వడ్డీరేట్లను గరిష్ఠ స్థాయిల్లోనే ఉంచడం దాస్‌కే చెల్లింది. 2016లో పాత పెద్ద నోట్ల రద్దు అంశంలోనూ నాటి ఆర్బీఐ గవర్నర్ పటేల్ కంటే దాసే కీలక పాత్ర పోషించడం విశేషం.

రూపాయి.. బెంబేలు

చారిత్రక కనిష్ఠ స్థాయి 84.86కి విలువ

ముంబై, డిసెంబర్ 9: దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులు పడ్డాయి. అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితి నెలకొనడంతోపాటు దేశీయ ఈక్విటీలు కుదేలవడంతో కరెన్సీ విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఫారెక్స్ మార్కెట్‌లో సోమవారం ఒకేరోజు 20 పైసలు నష్టపోయి నెల కనిష్ఠ స్థాయిని 84.86ని తాకింది. మునుపెన్నడు లేని స్థాయికి పతనమైనట్లు అయింది. డాలర్‌కు అనూహ్యంగా దిగుమతిదారుల, విదేశీ బ్యాంకుల నుంచి డిమాండ్ నెలకొనడంతో ఇతర కరెన్సీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 84.70 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్చేంజ్ రేటు ఇంట్రాడేలో 84.86 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. చివరకు ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి కరెన్సీ విలువపై 20 పైసలు కోల్పోయి 84.86 వద్ద ముగిసింది. గత శుక్రవారం 5 పైసలు పెరిగి 84.66 వద్ద ముగిసిన విషయం తెలిసిందే. ఈ నెల 4న చారిత్రక కనిష్ఠ స్థాయి 84.75ని తాకిన విషయం తెలిసిందే. రూపాయి పతనంతో భారత్ దిగుమతులపై అధికంగా చెల్లింపులు జరుపాల్సి ఉంటుంది.

రోజూ 10 లక్షల స్పామర్స్

గుర్తించిన ఎయిర్‌టెల్ ఏఐ నెట్‌వర్క్

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: తమ కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత స్పామ్ ఫిల్టర్.. రోజూ 10 లక్షల స్పామర్స్‌ను గుర్తించినట్టు సోమవారం భారతీ ఎయిర్‌టెల్ ప్రకటించింది. ఇక గత రెండున్నర నెలల్లో 800 కోట్ల స్పామ్ కాల్స్‌ను, 80 కోట్ల ఎస్ఎంఎస్‌లను కూడా గుర్తించినట్టు ఈ దేశీయ ప్రైవేట్ రంగ టెలికం సంస్థ ఓ ప్రకటనలో పేర్కొన్నది. దీంతో ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌పై వచ్చిన కాల్స్‌లో 6 శాతం, ఎస్ఎంఎస్‌ల్లో 2 శాతం స్పామర్లు చేసినవేనని తేలింది. స్పామ్ కాల్స్ చేసింది, అందుకున్నది రెండింటిలోనూ ఢిల్లీ అగ్రస్థానంలో ఉన్నట్టు సంస్థ వెల్లడించింది. ఢిల్లీ తర్వాత ఏపీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ యూజర్లు స్పామ్ కాల్స్‌ను అధికంగా అందుకున్నారు. ఢిల్లీ తర్వాత ముంబై, కర్నాటకల నుంచి స్పామ్ కాల్స్ ఎక్కువగా వెళ్లాయి. అలాగే ల్యాండ్‌లైన్ ఫోన్ల నుంచే స్పామ్ కాల్స్ అధికంగా వస్తున్నట్టు కనిపెట్టారు. ఎస్ఎంఎస్‌ల విషయానికొస్తే.. గుజరాత్, కోల్‌కతా, యూపీల నుంచి ఎక్కువగా వచ్చాయి. ముంబై, చెన్నై, గుజరాత్ వాసులే లక్ష్యంగా ఇవి వెళ్లాయి. పురుష వినియోగదారులే లక్ష్యంగా 76 శాతం స్పామ్ కాల్స్ వచ్చాయి. ఈ ఏఐ పవర్డ్ సొల్యూషన్‌ను రెండున్నర నెలల క్రితమే ఎయిర్‌టెల్ అందుబాటులోకి తెచ్చింది. కాగా, దీంతో భారతీయ తొలి స్పామ్ ఫైటింగ్ నెట్‌వర్క్‌గా భారతీ ఎయిర్‌టెల్ నిలిచింది. మొబైల్ వినియోగదారులను విసిగిస్తున్న ఈ అవాంఛిత కాల్స్, సందేశాలకు అడ్డుకట్ట వేయాలని టెలికం సంస్థలను టెలికం రంగ రెగ్యులేటర్ ట్రాయ్ ఆదేశించినది తెలిసిందే.

వాహన ధరలు పెంచిన టాటా, కియా

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: వాహన ధరలను మరో రెండు సంస్థలు పెంచాయి. ఇప్పటికే మారుతి, హ్యుందాయ్, మహీంద్రాతోపాటు లగ్జరీ సంస్థలైన మెర్సిడెజ్ బెంజ్, బీఎండబ్ల్యూ తమ వాహన ధరలను 3 శాతం వరకు పెంచగా..తాజాగా ఇదే జాబితాలోకి టాటా మోటర్స్, కియాలు కూడా చేరాయి. ఉత్పత్తి వ్యయం అధికం కావడంతో పాటు నిర్వహణ ఖర్చులు పెరగడం వల్లనే వాహన ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు ఇరు సంస్థలు ప్రకటించాయి. టాటా మోటర్స్ తన ప్యాసింజర్ వాహన ధరలను జనవరి నుంచి అమలులోకి వచ్చేలా 3 శాతం వరకు సవరిస్తుండగా, అదే కియో వాహనధరలు 2 శాతం వరకు పెంచుతున్నట్టు తెలిపింది.

79 వేల దిగువకు పుత్తడి

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలో పుత్తడి ధర రూ.79 వేల దిగువకు పడిపోయింది. బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి రూ.190 తగ్గిన తులం ధర రూ.78,960కి దిగొచ్చింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర రూ.190 తగ్గి రూ.78,650గా నమోదైంది. కానీ వెండి ధరలు పెరిగాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి రూ.350 పెరిగి రూ.93,850 పలికింది. కానీ, హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ తులం పుత్తడి ధర స్వల్పంగా రూ.160 పెరిగి రూ.77,780కి చేరుకున్నది. అలాగే 22 క్యారెట్ గోల్డ్ ధర రూ.150 అందుకొని రూ.71,300కి చేరింది. అంతర్జాతీయంగా రాజకీయ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో ఎంసీఎక్స్ మార్కెట్లో బంగారం ధరలు పెరిగినప్పటికీ రిటైల్‌గా మాత్రం తగ్గుముఖం పట్టాయని ఆల్ ఇండియా సరాఫ్ అసోసియేషన్ వర్గాలు వెల్లడించాయి. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,673 డాలర్లు పలుకగా, వెండి 32.19 డాలర్ల వద్ద ఉన్నది.

12 నుంచి ప్యాకాన్-2024 సదస్సు

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): ప్యాకేజింగ్ రంగం పురోగతి, భవిష్యత్తు అవసరాలపై ప్యాకాన్-2024 పేరుతో ఈ నెల 12, 13 తేదీల్లో హైదరాబాద్‌లో సదస్సు నిర్వహించబోతున్నట్లు సీఐఐ తెలంగాణ ప్రకటించింది. రేపటి ప్రపంచ మార్కెట్ సవాళ్ల కోసం నేటి ఆవిష్కరణలు' అనే థీమ్‌తో ఏర్పాటుచేస్తున్న ఈ సదస్సుకు ఆ రంగానికి చెందిన నిపుణులు, ఆవిష్కర్తలు, వాటాదారులు.. పెరుగుతున్న మార్కెట్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని చేయాల్సిన నూతన ఆవిష్కరణలపై చర్చించనున్నట్లు సీఐఐ తెలంగాణ ఛైర్మన్ సాయి డీ ప్రసాద్ తెలిపారు. సుమారు 200మందికిపైగా ప్రతినిధులు హాజరయ్యే ఈ సదస్సులో ప్యాకేజింగ్ రంగానికి చెందిన ఉత్పత్తులను కూడా ప్రదర్శించనున్నట్లు చెప్పారు.

సమ్మె నోటీస్ అందజేత

ఇచ్చోడ, డిసెంబర్ 9: ఇచ్చోడ, సిరికొండ మండలాల్లోని కేజీబీవీ, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్, సీఆర్పీ, ఎంఐఎస్, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు సోమవారం ఇచ్చోడ, సిరికొండ ఎంఈవోలు సునీల్, బిక్కుకు వినతి పత్రాలు అందజేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్, పీటీఐలకు 12 నెలల వేతనం ఇవ్వాలని, ఎస్ఎస్ఏ ఉద్యోగులందరికీ రీ-ఎంగేజ్ విధానం తొలగించాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు రవీందర్, మనోహర్, కేజీబీవీ ఉద్యోగులు పాల్గొన్నారు.

హనుమాన్ స్వాముల నగర సంకీర్తన

బోథ్, డిసెంబర్ 9 : కౌ(బీ) గ్రామంలో సోమవారం హనుమాన్ స్వాములు నగర సంకీర్తన చేపట్టారు. సన్నిధానం నుంచి హనుమంతుని చిత్రపటాలు చేత పట్టుకొని గ్రామంలోని విధుల గుండా శోభాయాత్ర చేపట్టారు. హనుమాన్, వీర హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సన్నిధానం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామస్తులంతా సహాపంక్తి భోజనాలు చేశారు. తమ 41 రోజుల దీక్ష కాలం పూర్తికావడంతో హనుమాన్ స్వాములు కొండగట్టుకు బయలుదేరారు.

108లో ప్రసవం

కుభీర్, డిసెంబర్ 9 : నిండు గర్భిణి 108 అంబులెన్స్‌లో పండంటి బిడ్డకు జన్మనిచ్చిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. కుభీర్ మండలం రంజినితండా గ్రామానికి చెందిన దేవుకాబాయి గర్భిణి. నెలలు నిండటంతో సోమవారం తెల్లవారుజామున పురటినొప్పులు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది అంబులెన్స్‌తో రంజినితండా చేరుకొని ఆమెను బైంసా ఏరియా దవాఖానకు తీసుకువస్తుండగా మాలేగాంవ్ గ్రామ సమీపంలో నొప్పులు అధికమయ్యాయి. వెంటనే వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి ఈఎంటీ పూజారి లక్ష్మణ్, ఏఎన్ఎంలు కాన్పు చేయగా ఆడ శిశువు జన్మించింది. సిబ్బందితో పాటు పైలెట్ గౌతంకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

దామోదర రావు మరణం తీరని లోటు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 9: నిర్మల్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది దామోదర రావు మరణం తీరని లోటని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. తన అకాల మరణంపై సోమవారం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. సంఘం సభ్యులు వోస మహేందర్, కిషన్, జనార్దన్, గోవర్ధన్, లింగయ్య, రమణా గౌడ్, రమణా రావు, శ్రీకాంత్, నరేందర్, రమణ, సుజాత, వరలక్ష్మి, రాజు, ఫసియొద్దీన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

లక్ష్మణచాంద, డిసెంబర్ 9: మండలంలోని పీచర గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి వికాస్ జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మూడో బహుమతి సాధించాడు. సోమవారం ప్రధానోపాధ్యాయుడు సాయికృష్ణ విద్యార్థిని అభినందించారు. అతనితో పాటు సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందనలు తెలిపాడు. వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మణచాందలో బయోసైన్స్‌ఫోరం టాలెంట్ టెస్ట్

లక్ష్మణచాందలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం బయోసైన్స్ టాలెంట్ టస్ట్‌ను నిర్వహించారు. ఈ పరీక్షలో ఇంగ్లిష్ మీడియం నందు వడ్యాల్ ఉన్నత పాఠశాలకు చెందిన శృతిక ప్రథమ స్థానం, లక్ష్మణచాంద ఉన్నత పాఠశాలకు చెందిన రాంచరణ్ ద్వితీయ స్థానం, తెలుగు మీడియం నందు పీచర ఉన్నత పాఠశాలకు చెందిన అనుష్క ప్రథమ స్థానం, రష్మిత ద్వితీయ స్థానం కనబరచినట్లు లక్ష్మణచాంద ప్రధానోపాధ్యాయుడు రాజునాయక్ తెలిపారు. కార్యక్రమంలో సైన్స్‌ఫోరం పరిశీలకుడు గంగాసురేశ్, సుదర్శన్, మండల ఇన్‌చార్జి రమేశ్ గౌడ్ పాల్గొన్నారు.

డీఆర్డీవోకు సన్మానం

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 9 : నిర్మల్ జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో సోమవారం డీఆర్డీవో విజయలక్ష్మిని పక్షిప్రేమికులు, సామాజిక కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. పక్షుల కొరకు తయారు చేయిస్తున్న వరి కుంచెలను ప్రత్యక్షంగా చూశారు. ఈ సందర్భంగా పక్షి ప్రేమికులు మాట్లాడుతూ అంతరించిపోతున్న పక్షులను సంరక్షించాలనే ఉద్దేశంతో వాటి ఆహార కొరతను దృష్టిలో పెట్టుకొని అనాదిగా వస్తున్న మనం మరచిన ఈ వరికుంచెల సంప్రాదాయాన్ని తెలిపేందుకు డీఆర్డీవో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పక్షిప్రేమికులు, సామాజిక కార్యకర్తలు జక్కుల వెంకటేశ్, నవీన్ పాల్గొన్నారు.

రిమ్స్‌లో విజయ డెయిరీ పాల ఉత్పత్తుల కేంద్రం ప్రారంభం

విజయ డెయిరీ పాల ఉత్పత్తు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, డిసెంబర్ 9 : రిమ్స్‌కు వచ్చే రోగులు, వారి సహాయకులకు నాణ్యమైన విజయ డెయిరీ పాలు, పాల ఉత్పత్తులను అందించేలా రిమ్స్ ఆవరణలో పార్లర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య ఆధ్వర్యంలో రిమ్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పార్లర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. అంతకు ముందు డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, పర్యవేక్షకుడు డా. అశోక్‌లు ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ మేనేజర్లు తుషార్, దస్రు నాయక్, పంపిణీదారు నరేందర్, సిబ్బంది ఊశన్న, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇచ్చోడ, డిసెంబర్ 9: తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మణ్‌కు పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయి విధి నిర్వహణలో అనేక సమస్యలు ఎదుర్కొంటు ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీల్లో నిధుల సమస్యలతో పాటు పని భారంతో కృంగిపోతున్నారన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రకటన విడుదల చేసి దీర్ఘకాలంగా ఆపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడు షేక్ అజార్, జనరల్ సెక్రటరీ కాంబ్లే రాహుల్, ట్రెజరీ రాజేశ్వర్ ఉన్నారు.

దిలావర్‌పూర్, డిసెంబర్ 9: పంచాయతీ కార్యదర్శులకు ఇందిరమ్మ ఇండ్ల సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని 12 గ్రామ పంచాయతీల కార్యదర్శులు మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీవోకు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కుంటాల, డిసెంబర్, 9 : పంచాయతీ కార్యదర్శులకు జాబ్‌చార్ట్‌కు అదనంగా అప్పగించే విధులను రాతపూర్వకంగా సర్కులర్ ద్వారా మాత్రమే ఆదేశాల జారీ చేయాలని, కార్యదర్శులను మానసికంగా ఇబ్బంది కలిగించరాదని పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీవో లింబాద్రిని కలిసి వినతిపత్రం అందజేశారు ఇక్కడ మండల కార్యదర్శులు శ్రీ నివా స్, సారిక, సుమన్, రమ్య, రాజు, సతీశ్ కుమార్, యో గేశ్, రాజబాపు, అరుణ, సాయేందర్, గంగాప్రసాద్, భోజన్న, ఉత్తమ్ ఉన్నారు. పంచాయతీ కార్యదర్శుల

నర్సాపూర్(జి), డిసెంబర్ 9: మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో పుష్పలతకు వినతి పత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, విధి నిర్వహణలో మరణించిన కార్యదర్శులకు రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శులు నవనీత్ కుమార్, గంగజల వెంకటేశ్, రాజు, సంధ్య ఉన్నారు.

కుభీర్, డిసెంబర్ 9: ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల సర్వే నుంచి తమను మినహాయించాలని మండలంలోని 41మంది పంచాయతీ కార్యదర్శులు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నవనీత్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. టీపీఎస్ఎఫ్ జే పీఏసీల మండల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, కమల్‌సింగ్ ఉన్నారు.

తానూర్, డిసెంబర్ 9 : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ లింగమూర్తికి మండల పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఇక్కడ మండల అభివృద్ధి అధికారి అబ్దుల్ సమద్, మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గొలుసు అపహరణ

భైంసా, డిసెంబర్ 9: భైంసాలోని బస్టాండ్‌లో కుభీర్‌కు చెందిన లింగంపల్లి లక్ష్మి సోమవారం బస్సు ఎక్కుతుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోనుంచి ఒక టిన్నర తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడు. వెంటనే ఆమె గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సైబర్ క్రైమ్ కార్యాలయం ప్రారంభం

ఎదులాపురం, డిసెంబర్ 9 : సైబర్ క్రైమ్ బారిన పడితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలనీ ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లోని పోలీసు ముఖ్య కార్యాలయం నందు నూతన సైబర్ క్రైమ్ కార్యాలయాన్ని పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో ప్రారంభించారు. మొదటగా సైబర్ క్రైమ్ కార్యాలయాన్ని ప్రారంభానికి విచ్చేసిన ఎస్పీకి ఆదిలాబాద్ సైబర్ డీఎస్పీ హసీబుల్ల పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. ఇప్పటివరకు ఆదిలాబాద్ జిల్లాలో సైబర్ బారిన పడి నష్టపోయిన 90 మంది బాధితులకు రూ.17,62,381 తిరిగి వారికి న్యాయశాఖ సహకారంతో అందజేసినట్లు తెలిపారు. సైబ ర్ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉం టూ ఎలాంటి ఫిర్యాదులనైనా తక్షణమే స్పం దిస్తూ బాధితులకు న్యాయం చేకూర్చే విధం గా శిక్షణను తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. అదనపు ఎస్పీ బీ సురేందర్ రావు, డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, హసీబుల్లా, పోలీసు కార్యాలయం ఏవో భక్త ప్రహ్లాద్, సూపరింటెండెంట్లు సంజీవ్, గంగాధర్, ఇన్‌స్పెక్టర్లు డీ సాయినాథ్, కరుణాకర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డీ వెంకటి, టీ మురళి, చంద్రశేఖర్ సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.






మలయాళంలో సూపర్ హిట్ సాధించిన చిత్రం
తెలుగులో ఈ నెల 13న బ్రహ్మాండమైన విడుదల
AN EYE FOR AN EYE
WRITTEN & DIRECTED BY
JOJU GEORGE
సుదర్శన్ 70 ఎం